PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE


TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :150 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : ఆదివారం -154 నవంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:150 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: SUNDAY 15 NOVEMBER 2026 PAGES: 04 RS:01/

గ్రామస్థాయి ఎన్నికల్లోనూ
కూటమి విజయమే లక్ష్యం!

- 23 పట్టణ స్థానిక సంస్థల్లో తిరుగులేని గెలుపు సాధించాలి
- గ్రామాల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులనే గెలిపించాలి
- వ్యక్తిగత పంతాలు, విభేదాలు పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాలి
- టీడీపీ ముఖ్యనేతలకు చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి, 14(నేటి మినిట్ టు మినిట్): పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కూటమికి ప్రజలు చారిత్రక విజయాన్ని అందించారని, ఇదే స్ఫూర్తితో రాబోయే 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలిచేలా నాయకులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం టీడీపీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఎన్నికల వ్యూహం, నాయకుల మధ్య సమన్వయం, అభ్యర్థుల మిగతా2లో...



2లో

న్యాయంతోనే సమాజంలో
సమానత్వం సాధ్యం

- రాజ్యాంగ విలువల పరిరక్షణకు న్యాయవాదులు కృషి చేయాలి: మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

అభ్యర్థుల భద్రతకు
ప్రత్యేక చర్యలు

- కోరితే పోలీసు ఎస్కార్ట్‌తో నామినేషన్ దాఖలుకు అవకాశం: రాష్ట్ర ఎన్నికల కమిషనర్



చిన్నారుల భవిష్యత్తుకు
నాణ్యమైన విద్యే పునాది

బాలల అభ్యున్నతితోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్



ఉత్తరాంధ్రకు మరో
తుపాను ముప్పు

- 18, 19 తేదీల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల హెచ్చరిక.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి



గిగ్ కార్మికుల సంక్షేమానికి
భరోసా



- రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా.. ప్రతి డెలివరీపై 1 శాతం సంక్షేమ నిధికి జమ
- గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం ప్రారంభోత్సవంలో రాహుల్ గాంధీ



పెట్టుబడులకు
తెలంగాణలో భరోసా

పాలసీల్లో మార్పులు లేవు.. పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

ఆస్పత్రుల నిర్మాణానికి రూ.12 వేల కోట్లు ఖర్చు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): తెలంగాణలో పెట్టుబడిదారుల పట్ల ఎలాంటి వివక్ష లేదని, పారిశ్రామిక విధానాల్లోనూ ఎటువంటి గందరగోళం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని, ధైర్యంగా పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు మిగతా2లో...

గంగానది ప్రక్షాళనకు
రూ.43 వేల కోట్లు వృథా!


- పుష్కర కాలం దాటినా మారని నది పరిస్థితి
- 'నమామి గంగే' పథకం లక్ష్యం నెరవేరని వైనం
- నదీజలాల్లో ప్రమాదకర స్థాయిలో కాలుష్య కారకాలు
- కేటాయించిన నిధుల్లో సగమే ఖర్చు.. అయినా ఫలితం శూన్యం



న్యూఢిల్లీ,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): గంగానదిని ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన జలాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్రం 2014లో ప్రారంభించిన 'నమామి గంగే' పథకం ఆశించిన ఫలితాలను సాధించలేకపోయి ంది. నది శుద్ధి కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ కాలుష్య సమస్య మాత్రం తగ్గడం లేదు. గంగానదిలో మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు యథేచ్ఛగా కలుస్తుండటంతో నదీజలాల నాణ్యత మరింత దిగజారుతోంది. బ్లూమ్‌బెర్గ్, ఐఐటీ ఖరగ్‌పూర్ నిపుణుల సహకారంతో నిర్వహించిన పరిశోధనాత్మక మిగతా2లో...

విలక్షణ నటుడు
గిరిబాబు కన్నుమూత

- 600కుపైగా చిత్రాల్లో నటన.. సినీ ప్రముఖుల నివాళులు



గ్రామస్థాయి ఎన్నికల్లోనూ కూటమి విజయమే లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక తదితర అంశాలపై సూచనలు చేశారు. **గ్రామస్థాయిలోనూ గెలుపే లక్ష్యం** పట్టణ, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమికి అండగా నిలిచారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇదే విజయ పరంపరను గ్రామస్థాయి ఎన్నికల్లోనూ కొనసాగించాల ని సూచించారు. స్థానిక ఎన్నికల్లో యువతకు, విద్యావంతులకు అవకాశం కల్పించామని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను నాయకులు తేలిగ్గా తీసుకోవద్దని, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో మంచి పేరున్న అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. కూటమి తరఫున బలపరిచే అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. **విభేదాలకు తావివ్వొద్దు** నాయకులు వ్యక్తిగత పంతాలు, విభేదాలకు దూరంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించవద్దని, గొడవలకు వెళ్లకుండా సంయమనంతో పనిచేయాలని సూచించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం మరింత పెంచుకోవాలని చెప్పారు. ఇప్పటికే విజయం సాధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు చురుగ్గా వ్యవహరించాలని, గ్రామస్థాయిలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. **ఏడు జిల్లాల్లో క్లీన్‌స్వీప్** ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు ప్రస్తావిస్తూ సుమారు ఏడు జిల్లాల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసిందని తెలిపారు. అనకాపల్లి, మార్కాపురం జిల్లాల్లో నూరుశాతం విజయాలు సాధించామని పేర్కొన్నారు. ఉద్యోగులంతా కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని, వైసీపీ చేసిన తప్పుడు ప్రచారాలను ప్రజలు విశ్వసించలేదని అన్నారు. ప్రజలు అందించిన విజయాన్ని బాధ్యతగా స్వీకరించి, మరింత మెరుగైన పాలన అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాబోయే పట్టణ, గ్రామస్థాయి ఎన్నికల్లోనూ ఇదే ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణతో పనిచేయాలని చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

గిగ్ కార్మికుల సంక్షేమానికి భరోసా

హైదరాబాద్,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): గిగ్ కార్మికులకు భద్రత, సామాజిక రక్షణ కల్పించడంతో పాటు వారిని ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. గిగ్ కార్మికులను వెట్టి చాకిరీ చేసే కూలీలుగా మార్చాలనేది బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలమని విమర్శించారు. కార్మికుల శ్రమ ఫలితాలు అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు, ఉబర్, ఓలా వంటి సంస్థలకు దక్కాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. గిగ్ కార్మికులు దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది, ఆధారమని, వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం ప్రారంభోత్సవ సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. 21వ శతాబ్దం డేటా శతాబ్దమని, ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలు డేటా ఆధారంగానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. అయితే దేశంలోని గిగ్ కార్మికులకు తమ పనికి సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండటం లేదన్నారు. తాము ఎన్ని పనులు చేశాం, ఎన్ని డెలివరీలు పూర్తి చేశాం, ఎంత సమయం వెచ్చించాం, ఎంత ఆదాయం వచ్చింది అనే వివరాలను తెలుసుకునే అవకాశం గతంలో లేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ద్వారా గిగ్ కార్మికులకు తమ డేటాపై హక్కు లభిస్తుందని తెలిపారు.

వారు చేసిన పనులు, పూర్తి చేసిన రైడ్లు, డెలివరీలు, ప్రతి లావాదేవీకి జమ అయిన మొత్తం వివరాలు వారి మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. దీంతో కార్మికులు తమ పని, ఆదాయానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని స్వయంగా పరిశీలించుకోవచ్చని వివరించారు.

గతంలో ఇచ్చిన హామీ మేరకు గిగ్ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాహుల్ గాంధీ తెలిపారు. కార్మికులు పని మధ్యలో విశ్రాంతి తీసుకునేందుకు వైపై సౌకర్యంతో కూడిన ప్రత్యేక విశ్రాంతి కేంద్రాలు (రెస్ట్ జోన్లు) ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాల్లో వీటిని నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రతి గిగ్ కార్మికుడికి రూ. 5 లక్షల ప్రమాద బీమా, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా కల్పించనున్నట్లు ప్రకటించారు.

గిగ్ కార్మికులకు దీర్ఘకాలిక సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని వారి సంక్షేమ నిధికి జమ చేయనున్నట్లు తెలిపారు. ఆయా కంపెనీలు ప్రతి లావాదేవీపై ఈ మొత్తాన్ని తెలంగాణ గిగ్ వర్కర్స్ బోర్డులో జమ చేయాల్సి ఉంటుందని, అనంతరం బోర్డు ద్వారా ఆ నిధులు నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాలకు చేరుతాయని వివరించారు. అంతకుముందు శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్ వరకు గిగ్ కార్మికులతో కలిసి రాహుల్ గాంధీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఏఐసీసీ నాయకులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు తెలంగాణలో భరోసా

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో పబ్లిక్ హెల్త్ సైన్సెస్ సంస్థ (పీహెచ్ఎఫ్ఐ) క్యాంపస్ నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు ప్రారంభించిన ఆర్థిక సంస్కరణల విధానాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన పారిశ్రామిక విధానాలను కూడా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. అనుమతులు, భూములు, నీరు వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు రూపొందించామని పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నామని, డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు పెట్టుబడులు, అంతర్జాతీయ గుర్తింపు రావడంలో ఐఎస్‌బీ, నల్సార్ వంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం అన్నారు. పేదలకు అత్యాధునిక వైద్యం అందించేందుకు టిమ్స్ ఆస్పత్రులతోపాటు గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా నిర్మిస్తున్నామని తెలిపారు. వీటి నిర్మాణానికి రూ. 12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు తమ శాఖలను ప్రారంభిస్తున్నాయని, స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య ఇక్కడే అందుబాటులోకి వస్తోందని పేర్కొన్నారు. పీహెచ్ఎఫ్ఐ క్యాంపస్ కూడా హైదరాబాద్‌కు మరింత గుర్తింపు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గంగానది ప్రక్షాళనకు రూ.43 వేల కోట్లు వృథా!

(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం ఈ పరిస్థితిని వెల్లడించింది. సుమారు 2,500 కిలోమీటర్ల మేర ప్రవహించే గంగానది పరిస్థితిని అంచనా వేసేందుకు నాసా, కోపర్నికస్ సంస్థలకు చెందిన పదేళ్ల ఉపగ్రహ సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించి పరీక్షించారు. గత దశాబ్దంతో పోలిస్తే గంగానదిలోని అనేక ప్రాంతాల్లో నీటి నాణ్యత గణనీయంగా పడిపోయినట్లు గుర్తించారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలు, జనసాంద్రత అధికంగా ఉన్న నగరాలు, పుణ్యక్షేత్రాల సమీపంలో సేకరించిన నీటి నమూనాల్లో కాలుష్య కారకాలు అనుమతించిన పరిమితులను మించి ఉన్నట్లు తేలింది. **వర్షాకాలం తర్వాత మరింత కాలుష్యం** గంగానది కాలుష్య సమస్యను వర్షాకాలం మరింత తీవ్రతరం చేస్తోంది. వర్షాకాలం అనంతరం వచ్చే నెలల్లో నదిలోని దాదాపు 80 శాతం ప్రాంతాల్లో నీరు అధికంగా బురదమయంగా మారుతున్నట్లు అధ్యయనం వెల్లడించింది. వర్షాల కారణంగా నదిలోకి చేరుతున్న మట్టి, ఇతర వ్యర్థాలు నీటి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా అనేక ప్రాంతాల్లో నదీజలాలు స్నానానికి కూడా అనువుగా లేని పరిస్థితులు నెలకొంటున్నాయని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. **సగం నిధులే ఖర్చు.. ఫలితాలేవి?** గంగానది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం గత దశాబ్ద కాలంలో రూ. 43,060 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. అయితే ఈ నిధుల్లో సగం మాత్రమే ఖర్చయినట్లు అధ్యయనం పేర్కొంది. ఇంత భారీ మొత్తంలో ప్రజాధనం కేటాయించినప్పటికీ నదిలో కాలుష్యం అదుపులోకి రాకపోవడం పథకం అమలుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. కేటాయించిన నిధులు ఎంతవరకు వినియోగమయ్యాయి? చేపట్టిన పనులు ఏ మేరకు పూర్తయ్యాయి? వాటి వల్ల నదీ జలాల నాణ్యతలో ఎలాంటి మార్పులు వచ్చాయి? అనే అంశాలపై సమగ్ర సమీక్ష అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగితాలపై కనిపిస్తున్న పురోగతికి, క్షేత్రస్థాయిలో నది పరిస్థితికి మధ్య అంతరం ఉండటానికి కారణాలను గుర్తించాల్సిన అవసరం ఉంది. **మురుగునీటిని అడ్డుకోవడంలో వైఫల్యం** గంగానది కాలుష్యానికి ప్రధాన కారణం పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న శుద్ధి చేయని మురుగునీరు, పరిశ్రమల వ్యర్థాలే. ఇళ్ల నుంచి వెలువడే మురుగునీటిలో అధిక భాగం సరైన శుద్ధి లేకుండానే నదిలో కలుస్తోంది. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలను నియంత్రించడంలోనూ అధికార యంత్రాంగం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని అధ్యయనం పేర్కొంది. మరోవైపు మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు) పూర్తి సామర్థ్యంతో, నిరంతరాయంగా పనిచేయకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల మధ్య సమన్వయ లోపం, కాలుష్య నియంత్రణ నిబంధనల అమలులో నిర్లక్ష్యం కూడా నదీ ప్రక్షాళనకు అడ్డంకులుగా మారుతున్నాయి. జనాభా పెరుగుదల, పట్టణీకరణ కారణంగా నదిలోకి చేరుతున్న వ్యర్థాల పరిమాణం పెరుగుతున్నప్పటికీ వాటిని అడ్డుకునేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. **ప్రజల ఆరోగ్యానికీ ముప్పు** గంగానది కాలుష్యం కేవలం నదీజలాలకే పరిమితమైన సమస్య కాదు. కలుషిత నీరు పరిసర ప్రాంతాల్లోని భూగర్భజలాలపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ నీటిని వ్యవసాయానికి వినియోగిస్తే పంటల నాణ్యత, నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉంది. కలుషిత నీటితో ప్రజలకు అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పరిశోధన హెచ్చరిస్తోంది. కోట్లాది మంది ప్రజల జీవనాధారంగా ఉన్న గంగానది పరిరక్షణను నిర్లక్ష్యం చేయడం పర్యావరణంతోపాటు ప్రజారోగ్యానికీ ముప్పుగా మారనుంది.

ప్రచారం కాదు.. కార్యాచరణ ముఖ్యం గంగానది ప్రక్షాళన అనేది కేవలం నిధుల కేటాయింపుతోనో, భారీ ప్రాజెక్టుల ప్రకటనలతోనో సాధ్యమయ్యేది కాదు. నదిలోకి చేరే మురుగునీటిని పూర్తిస్థాయిలో అడ్డుకోవడం, పరిశ్రమల వ్యర్థాలపై కఠిన నియంత్రణ విధించడం, శుద్ధి కేంద్రాలను సమర్థంగా నిర్వహించడం, నిరంతరం నీటి నాణ్యతను పర్యవేక్షించడం అవసరం. ప్రజాధనంతో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి, ఖర్చులు, ఫలితాలను పారదర్శకంగా వెల్లడించాలి. పవిత్ర నదిగా కోట్లాది మంది భావించే గంగను నిజంగా స్వచ్ఛంగా మార్చాలంటే ప్రచారానికి మించి పకడ్బందీ కార్యాచరణ అవసరం. లేదంటే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా గంగానది కాలుష్య కాసారంగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

న్యాయంతోనే సమాజంలో సమానత్వం సాధ్యం

విశాఖపట్నం,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): న్యాయ విద్యార్థులు న్యాయశాస్త్రంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జస్టిస్ కె. రామస్వామి స్మారకోపన్యాసంలో ఆయన పాల్గొన్నారు. నిస్సహాయుల పక్షాన నిలబడి నిర్భయంగా సత్యాన్ని సమర్థించాలని, ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధతో న్యాయరంగంలో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని, ఏఐ ద్వారా లభించే సమాచారాన్ని ప్రామాణిక ఆధారాలతో ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఏఐ వినియోగంలో మానవ పర్యవేక్షణ తప్పనిసరని స్పష్టం చేశారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మానవత్వం, నైతిక విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో న్యాయబంధు (ప్రోబోనో) క్లబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.పి. రాజశేఖర్, ఇతర అధికారులు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యర్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు

తిరుపతి,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు పోలీసు ఎస్కార్ట్ కల్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. అభ్యర్థులకు సాధారణ నామినేషన్ కేంద్రాల వద్ద ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటే జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో 12 జిల్లాల ఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో బెదిరింపులు, దాడులు, బలవంతపు చర్యలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్నికల భద్రతకు సంబంధించి 1,182 ఫిర్యాదులు అందినట్లు ఐజీపీ రాజకుమారి వెల్లడించారు.

ఉత్తరాంధ్రకు మరో తుపాను ముప్పు

అమరావతి,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్):
ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలకు మరోసారి తుపాను ముప్పు పొంచి ఉందని విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 18, 19 తేదీల్లో బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అల్పపీడనం వాయువ్య దిశగా పయనిస్తూ వాయుగుండంగా, అనంతరం తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నెల 18న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. 19న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. సోమవారం నుంచి తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ఆదివారం సాయంత్రంలోగా తీరానికి చేరుకోవాలని సూచించారు. ఈ నెల 16 నుంచి చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

చిన్నారుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే పునాది

అమరావతి,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్):
బాలల అభివృద్ధితోనే రాష్ట్రం, దేశం ప్రగతి సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారి భవిష్యత్తుకు నాణ్యమైన విద్య, మెరుగైన అవకాశాలు ఎంతో అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను కూడా నేర్పించాలని సూచించారు. చిన్నారుల కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పిల్లలు ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాల వైపు ముందుకు సాగాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. చిన్నారుల చిరునవ్వులు, ఆనందం ఎప్పటికీ నిలవాలని, వారి ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని సందేశమిచ్చారు.

విలక్షణ నటుడు గిరిబాబు కన్నుమూత

హైదర్‌బాద్,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): తెలుగు సినీ పరిశ్రమలో విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కొండాపూర్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించిన గిరిబాబు అసలు పేరు యర్రా శేషగిరిరావు. 1973లో 'జగమే మాయ' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఐదు దశాబ్దాల పాటు 600కుపైగా చిత్రాల్లో నటించారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా రాణించారు. జయభేరి పతాకంపై పలు చిత్రాలను నిర్మించారు. గిరిబాబు మృతిపట్ల చిరంజీవి, మోహన్‌బాబు, బాలకృష్ణ, పవన్ కల్యాణ్ తదితర సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో అభిమానుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచిన అనంతరం స్వగ్రామమైన రావినూతలకు తరలించారు. ఆదివారం అక్కడ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పులివెందుల ఎంపీపీ ఎన్నికకు రిజర్వేషన్ల చిక్కు

- **ఎస్టీలకు ఎంపీపీ పదవి.. ఐదు ఎంపీటీసీ స్థానాల్లోనూ ప్రాతినిధ్యం లేదు**
- **ఈ నెల 19న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడే అవకాశం**

కడప,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): కడప జిల్లా పులివెందుల మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నికకు రిజర్వేషన్ల సమస్య అడ్డంకిగా మారింది. ఎంపీపీ పదవిని ఎస్టీలకు కేటాయించినప్పటికీ, మండలంలోని ఐదు ఎంపీటీసీ స్థానాల్లో ఒక్కటి కూడా ఎస్టీలకు కేటాయించకపోవడంతో ఎన్నిక నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. దీంతో ఈ నెల 19న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 19న ఎంపీపీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 39 ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, పులివెందుల ఎంపీపీ పదవిని రోస్టర్ ప్రకారం ఎస్టీలకు కేటాయించారు. అయితే మండలంలోని అచ్చువెల్లి, ఇ-కొత్తపల్లి, ఎర్రబల్లి-1, ఎర్రబల్లి-2, రాగిమానుపల్లి ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించలేదు. ఈ ఐదు స్థానాల్లో అచ్చువెల్లి బీసీ జనరల్‌కు, ఇ-కొత్తపల్లి అన్‌రిజర్వుడ్‌కు, ఎర్రబల్లి-1 ఎస్సీ జనరల్‌కు, ఎర్రబల్లి-2, రాగిమానుపల్లి అన్‌రిజర్వుడ్ మహిళలకు కేటాయించారు. ఎస్టీ అభ్యర్థులకు ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశం లేకుండా పోయింది. ఎంపీపీ పదవి ఎస్టీలకు కేటాయించినా, ఆ పదవికి ఎన్నికయ్యే అర్హత కలిగిన సభ్యులు లేకపోవడం సమస్యగా మారింది. ఈ విషయాన్ని పులివెందుల ఎంపీడీవో సునీత జిల్లా పరిషత్ సీఈవో సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘం, పంచాయతీరాజ్ కమిషనర్‌కు సమస్యను వివరించినట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయంపై ఎంపీపీ ఎన్నిక నిర్వహణ ఆధారపడి ఉంది.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల వేళ పటిష్ట పోలీసు బందోబస్తు

● కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం తెలిపారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే అనుమతి ఉంటుందని, నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా రావడం పూర్తిగా నిషేధమని తెలిపారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ మరియు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని, నామినేషన్ కేంద్రాలకు 100 నుంచి 200 మీటర్ల పరిధిలో జనసమూహాలు గుమిగూడడం, నినాదాలు చేయడం, ప్రచారం నిర్వహించడం వంటి చర్యలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవాలకు ప్రోత్సాహకాలు: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



కర్నూలు నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): గ్రామాల్లో సామరస్యం, ఐక్యత, ఏకాభిప్రాయంతో కూడిన స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవమయ్యే గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహకాలను అందిస్తోందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులున్న గ్రామ పంచాయతీలకు 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ. 15 లక్షలు, 5,001 నుంచి 10 వేల జనాభా ఉన్న పంచాయతీలకు రూ. 25 లక్షలు, 10 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలకు 50 లక్షల రూపాయలు ప్రోత్సాహకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించిన అనంతరం ప్రోత్సాహకాలను అందించడం జరుగుతుందన్నారు. గతంలో 2 వేల లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికైతే 5 లక్షల రూపాయలు, 2001 నుండి 5000 జనాభా గ్రామ పంచాయతీలకు 10 లక్షల రూపాయలు, 5001 నుండి 10 వేల లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీలకు 15 లక్షల రూపాయలు, 10 వేల జనాభా దాటిన గ్రామ పంచాయతీలకు 20 లక్షల రూపాయలు ప్రోత్సాహకాలుగా అందించే వారని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జనాభా ననుసరించి 15 లక్షల రూపాయల నుండి 50 లక్షల రూపాయల వరకు పెంచిందన్నారు. ఎన్నికల అధికారులు సర్పంచ్ మరియు అన్ని వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలను ఏకగ్రీవంగా అధికారికంగా ప్రకటించిన గ్రామ పంచాయతీలకు మాత్రమే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందని కలెక్టర్ వివరించారు.

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

- పులివెందుల డిపో మేనేజర్ ప్రేమ్ కుమార్



పులివెందుల నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)పులివెందుల డిపో నుండి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ప్రేమ్ కుమార్ వెల్లడించారు. శనివారం డిపో మేనేజర్ మీడియాతో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన భానుకోట,భైరవేశ్వర స్వామి,పొలతల క్షేత్రం,పార్నపల్లి కోన మల్లేశ్వర స్వామి మరియు మోపురి దేవాలయాలను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నారని తెలిపారు. భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సౌకర్యవంతంగా పుణ్యక్షేత్రాలను సందర్శించుకునేందుకు వీలుగా ఈ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పులివెందుల పరిసర ప్రాంతాల ప్రజలు,శివ భక్తులు,అయ్యప్ప భక్తులు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. యాత్రలకు సంబంధించిన సమయాలు,బస్సుల ఏర్పాటు మరియు ఇతర పూర్తి వివరాల కోసం పులివెందుల ఆర్టీసీ డిపో అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లే భక్తులకు ఆర్టీసీ అందిస్తున్న ఈ ప్రత్యేక రవాణా సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డిపో అధికారులు పేర్కొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా నేమకల్లు బాలాంజనేయ స్వామికి విశేష పూజలు



బొమ్మనహాల్ నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): మండల పరిధిలో నేమకల్లు గ్రామంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన బాలాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి శనివారం శుభ సందర్భంగా స్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు, తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ చార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన,ఆకుపూజతో పాటు ప్రత్యేక అర్చనలు నిర్వహించి పుష్పాలు, పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించారు,ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు,అనంతరం మోడల్ ఎంటర్ప్రైజెస్ స్టోన్ క్రషర్స్ అధినేత పి.అజయ్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు,భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

బాలల దినోత్సవం రోజే బొగ్గుల బట్టీ వద్ద విషాదం

- బాలల దినోత్సవం రోజే బొగ్గుల బట్టీ వద్ద విషాదం.. ట్రాక్టర్ కింద పడి ఐదేళ్ల చిన్నారి మృతి
- ఆడుకోవాల్సిన వయసులో అనంతలోకం.. వేపరాలలో చిన్నారి అక్షర మృతి
- బాలల దినోత్సవం నాడే కన్నీటి విషాదం.. బొగ్గుల బట్టీ వద్ద చిన్నారి బలి
- బొగ్గుల బట్టీలపై ఫిర్యాదులు బుట్టదాఖలా? ఇప్పుడు ఐదేళ్ల చిన్నారి ప్రాణం బలి
- అధికారుల నిర్లక్ష్యానికి ఇంకెంతమంది బలి కావాలి? వేపరాలలో చిన్నారి మృతితో మళ్లీ భగ్గుమన్న ఆగ్రహం
- బొగ్గుల పొగతో రోగాలు.. ట్రాక్టర్ ప్రమాదంతో బాలిక మృతి.. వేపరాల గ్రామంలో విషాదం
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం.. గతంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదా? బొగ్గుల బట్టీల కాలుష్యంపై ఇప్పటికైనా స్పందిస్తారా?

రాయదుర్గం,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): బాలల దినోత్సవం రోజున అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం వేపరాల గ్రామ సమీపంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఎంతో సంతోషంగా ఆడుకోవాల్సిన ఐదేళ్ల చిన్నారి అక్షర ట్రాక్టర్ ప్రమాదం లో ప్రాణాలు కోల్పోయింది. బొగ్గుల బట్టీల వద్ద వలస కూలీలుగా పనిచేస్తున్న సూరి, మేరీ దంపతుల కుమార్తె అక్షర బట్టీ సమీపంలో ఆడుకుం టుండగా అటుగా వచ్చిన ట్రాక్టర్ కింద ప్రమాదవ శాత్తు పడిపోయింది. ట్రాక్టర్ చక్రాలు మీదుగా వెళ్లడంతో తీవ్ర గాయాలై చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

బొగ్గుల బట్టీలపై గతంలో ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమా?

వేపరాల గ్రామ పరిసరాల్లో నిర్వహిస్తున్న బొగ్గుల బట్టీల కారణంగా వెలువడుతున్న పొగ, కాలుష్యంతో గ్రామస్తులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు నామమాత్రపు విచారణలకే పరిమితమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బొగ్గుల బట్టీల నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టి, కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. చిన్నారి మృతికి దారితీసిన ప్రమాదంపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బాలల దినోత్సవం నాడే ఓ చిన్నారి ప్రాణం గాలిలో కలిసిపోవడం హృదయ విదారకం. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి బొగ్గుల బట్టీల కాలుష్యం, భద్రతా ప్రమాణాలపై చర్యలు తీసుకుంటారా? లేక మరో విషాదం జరిగే వరకు వేచి చూస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



పోలీస్ రక్షక్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



- విద్యార్థుల పాటలు, నృత్యాలు, పద్యాలు, నాటికలతో అలరించిన చిన్నారులు



అనంతపురం, నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం పోలీస్ రక్షక్ ప్రైమరీ స్కూల్‌లో జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ భాష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాటలు, నృత్యాలు, పద్యాలు, నాటికలతో అలరించడంతో పాటు స్పానిష్ భాషలో తాము నేర్చుకున్న అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె. నీలకంఠరెడ్డి, అనంతపురం అర్బన్ డీఎస్పీ పి. కరుణాకరరావు, ఆర్ఐలు పవన్‌కుమార్, మధు, పోలీసు అధికారుల కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో విషాదం...?

రెండో అంతస్తు నుంచి కిందపడిన బీఫ విద్యార్థిని మృతి...?

ప్రేమ వ్యవహారమే కారణమా?

ఘటనపై పలు అనుమానాలు



అనంతపురం, నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్): అనంతపురంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళాశాల రెండో అంతస్తు నుంచి కిందపడిన బీఏ హిస్టరీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వసంత తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కర్నూలుకు తరలించినట్లు సమాచారం.... అక్కడే మృతి చెందిన వసంత. వసంత నార్పల మండలం బి. పప్పూరు గ్రామానికి చెందిన విద్యార్థినిగా తెలుస్తోంది. ప్రేమ వ్యవహారమే ఈ ఘటనకు కారణమని, ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఘట నకు దారితీసిన అసలు కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. కళాశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

“ అలర్ట్...అలర్ట్...అలర్ట్.... ఓ ఎంపీటీసీ 10 లక్షలు ఇంకో ఎంపీటీసీ 20 లక్షలు “

● ప్రజాస్వామ్యమా... పైసాస్వామ్యమా...? ● రండి...బాబు...రండి....శింగనమల ప్రజలు వేసిన ఓట్లకు... నోట్లతో కోనుగోలు....? ● చోద్యం చూస్తున్న అధిష్టానం.... ఎమ్మెల్యే మీద వ్యతిరేక దిశగా శింగనమల నియోజకవర్గం రాజకీయం...? ● ఒక్కో ఎంపీటీసీకి ఒక్కో రేటు! రూ.10 లక్షలు.. రూ.20 లక్షలు.. సింగనమలలో ప్రజాస్వామ్యానికి వేలం? ● ప్రజలు ఓట్లేస్తే గెలుపు.. నాయకులు నోట్లిస్తే కొనుగోలా? సింగనమల రాజకీయాల్లో కొత్త వ్యాపారం ● ఎంపీటీసీలకు బహిరంగ మార్కెట్ ధరలా? సింగనమలలో తెరపైకి వచ్చిన రూ.లక్షల బేరసారాల ఆరోపణలు ● ఆరు ఓట్లు గెలిపించలేకపోయాయా? ఇప్పుడు టాస్‌తో గెలుపు.. నోట్లతో నాయకుల కొనుగోలు ప్రయత్నాలా? ● శింగనమల ప్రజాస్వామ్యానికి పట్టిన గ్రహణం.. ప్రజాప్రతినిధులకూ ధరలు నిర్ణయిస్తున్నారా? ● ఎమ్మెల్యే పాలనపై అసంతృప్తి.. షాడో ఎమ్మెల్యే చుట్టూ వివాదాలు.. పార్టీ పరువు నిలబెట్టేందుకు లక్షల బేరాలా? ● ఓటర్ల తీర్పు సరిపోలేదా? ఇప్పుడు ఎంపీటీసీలను కొనుగోలు చేస్తేనే రాజకీయ పరువా? ● అభివృద్ధి చేసి గెలవాలి కానీ.. నాయకులను కొనుక్కొని పరువు నిలబెట్టుకోవాలా? సింగనమలలో సెటైర్ల వర్షం ● 10 లక్షలకు ఒకరు.. 20 లక్షలకు మరొకరు! సింగనమలలో ఎంపీటీసీలకు రేట్లు కడుతున్నదెవరు? ● ప్రజాస్వామ్యమా.. పైసాస్వామ్యమా? సింగనమల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన ఎంపీటీసీల బేరసారాలు

శింగనమల,నవంబర్ 14(నేటి మినిట్ టు మినిట్):

ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓటు వేసి నాయకులను ఎన్నుకుంటారు. కానీ సింగనమల నియోజకవర్గంలో మాత్రం ప్రజల తీర్పు కంటే పైసల బేరాలకే ప్రాధాన్యత పెరుగుతోందా? అన్న అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను అధికార పార్టీ వైపు తిప్పుకునేందుకు భారీ మొత్తంలో డబ్బు ఆఫర్ చేస్తున్నారంటూ ప్రచారం సాగడం నియోజకవర్గంలో తీవ్ర చర్చకు దారితీసింది.ఒక ఎంపీటీసీకి రూ.10 లక్షలు, మరో ఎంపీటీసీకి రూ.20 లక్షలు అంటూ బేరసారాలు సాగుతున్నాయనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రజలు ఓట్లేసి గెలిపించిన ప్రజాప్రతినిధులకు ఇలా ధరలు నిర్ణయిస్తున్నారనే ప్రచారంపై ప్రజాస్వామ్యవాదులు మండిపడుతున్నారు. నిజంగానే ఇలాంటి ప్రయత్నాలు జరిగితే ప్రజల తీర్పుకు విలువ ఎక్కడుందని ప్రశ్నిస్తున్నారు.

అభివృద్ధి ఎక్కడ?
కొనుగోళ్ల రాజకీయం ఎందుకు?

సింగనమల నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ప్రజల్లో అసంతృప్తి ఉందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు అందాల్సిన సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాల్సిన నాయకత్వం రాజకీయ సమీకరణాలు, బేరసారాల చుట్టూ తిరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజంగా నియోజకవర్గంలో అభివృద్ధి చేసి ఉంటే ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఓట్లు మీవే.. నాయకులు మీవారే.. అధికారం మీ చేతుల్లోనే.. మరి అభివృద్ధి చేసి ప్రజల మనసులు గెలుచుకోవడంలో ఇబ్బంది ఏమిటంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.

షాడో ఎమ్మెల్యే ఎవరు?
తెర వెనుక చక్రం తిప్పుతున్నదెవరు?

నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే పేరుతో మరో రాజకీయ చర్చ నడుస్తోంది. ఎమ్మెల్యేకు సమాంతరంగా కొందరు వ్యక్తులు వ్యవహారాలు చక్కబెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక వ్యాపారాలు, సెటిల్మెంట్లు, ఇతర ఆర్థిక లావాదేవీల విషయంలో కొందరి పాత్రపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? తెరవెనుక వ్యవహారాలు నడిపిస్తున్నది ఎవరు? ఎంపీటీసీల కొనుగోలు ప్రయత్నాల వెనుక ఎవరున్నారు? అనే ప్రశ్నలకు సంబంధిత నాయకత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

రిపోర్టర్ నుంచి సర్పంచ్ అభ్యర్థి వరకు?

ఇక గతంలో ఓ ప్రముఖ పత్రికలో పనిచేసిన మాజీ విలేకరి చుట్టూ మరో ఆసక్తికరమైన రాజకీయ చర్చ సాగుతోంది. ఆయనను సర్పంచ్‌గా నిలబెట్టి గెలిపిస్తామంటూ కొందరు హామీలు ఇస్తున్నారనే ప్రచారం స్థానికంగా వినిపిస్తోంది. తెరవెనుక రాజకీయ మద్దతు ఉందనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. నిజంగానే అలాంటి రాజకీయ ప్రణాళిక ఉంటే దాని వెనుక ఉన్న నాయకులెవరు? మాజీ విలేకరి రాజకీయ అరంగేట్రానికి మద్దతిస్తున్నదెవరు? అన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రజల తీర్పును డబ్బుతో మార్చగలరా?

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపోటములు సహజం. ఆరు ఓట్ల తేడాతో గెలుపు నిర్ణయమయ్యే పరిస్థితులు వచ్చినా ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఫలితాలు తేలాలి. అవసరమైతే నిబంధనల ప్రకారం టాస్ ద్వారా కూడా నిర్ణయం తీసుకోవచ్చు. కానీ ఎన్నికల అనంతరం ప్రజాప్రతినిధులను డబ్బుతో కొనుగోలు చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు మాత్రం ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

అధిష్టానం ఇప్పటికైనా స్పందిస్తుందా?

నియోజకవర్గంలో నాయకత్వంపై అసంతృప్తి ఉందని వినిపిస్తున్న



విమర్శలను పార్టీ అధిష్టానం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

స్థానిక ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా రాజకీయ లెక్కలతో ముందుకెళ్తే భవిష్యత్తులో పార్టీకి ఇబ్బందులు తప్పవనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.ప్రజలు ఓటు వేసేది సేవ చేయడానికి.. ప్రజాప్రతినిధులు కొనుగోలు చేయడానికి కాదు. అభివృద్ధితో ప్రజల మనసులు గెలుచుకోవాలి కానీ డబ్బుతో నాయకులను కొనుగోలు చేసి రాజకీయ పరువు నిలబెట్టుకోవాలనుకోవడం ఎంతవరకు సమంజసం? సింగనమలలో ఇప్పుడు వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న ఇదే.. ప్రజాస్వామ్యానికి విలువ ఇస్తారా? లేక పైసాస్వామ్యానికి పట్టం కడతారా?

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.